క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీవస్‌జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా వసతి సౌకర్యం కూడా ఉందన్నారు. ఎన్ఎస్ఎస్, జాబ్‌డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్న్‌షిప్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. యూనివర్సిటీ స్థాయిలో మంచి ఫలితాలు కూడా సాధిస్తున్నామన్నారు.

కొండాపురంలో ఫ్యామిలీ డాక్టర్


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. దీర్ఘకాలిక రోగులకు సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్ఎం కుమారి, ఆర్.శ్రీనివాసరావు, ఆశా

సీబీఎస్ఈ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత

పార్వతీపురంటౌన్: సీబీఎస్ఈ పదోతరగతి ఫలితాల్లో పార్వతీపురం ఏకలవ్య పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఏబీవీపీ పట్నాయక్ తెలిపారు. మొత్తం 32మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 25మంది ప్రథమ శ్రేణి, ఏడుగురు ద్వితీయ శ్రేణిలో మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఎస్.దివ్యప్రియాంక 427 మార్కులు సాధించి పాఠశాలలో టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


బలిజిపేటలో విత్తనాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై సరఫరా చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు కొనుగోలు చేసుకుని పంట పొలాల్లో వేసుకోవాలని జెడ్పీటీసీ రవికుమార్ సూచించారు. ఈ మేరకు బలిజిపేటలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గంగయ్య ఆధ్వర్యంలో జెడ్పీటీసీ రవికుమార్ చేతుల మీదుగా పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రస్తుతం 50శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాలు ఆర్బీకేలలో ఉన్నాయని ఏఓ శ్రావణ్ తెలిపారు. కిలో రూ.79కు 50శాతం సబ్సిడీ పోను రూ.39.50పైసలకు అందిస్తున్నట్లు చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాల వల్ల భూసారం పెరిగి దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. కార్యక్రమంలో కె.గోపినాయుడు, రైతులు పాల్గొన్నారు. వర్కర్లు సేవలు అందించారు.

రాయితీపై గడ్డివిత్తనాలు


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సత్యంనాయుడు

తెర్లాం: మండలంలోని కుసుమూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై గడ్డివిత్తనాలు(జీలుగు, కట్టిజనుము) శుక్రవారం పంపిణీ చేశారు. ఏఓ జి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుటోందన్నారు. రైతులంతా సబ్సిడీపై ఇస్తున్న ఈ విత్తనాలను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. నవధాన్యాల సాగుపై రైతులు దృష్టిసారించాలని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేయడం జరుగుతోందని ఏఓ జి.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని చాటాయివలస రైతు భరోసా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 రకాలైన జొన్నలు, సజ్జలు, సామలు, బీర, బెండ, బొబ్బర్లు, కొర్రలు అందజేయడం జరుగుతోందన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసే వరి పంటలో జీలుగు, కట్టె జనుమును వేసుకుంటే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు.

రెండు పూటలా 'ఉపాధి' పని


మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు


ఉల్లిబద్రలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులు రెండు పూటల పాల్గొనాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని ఉల్లిబద్ర పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా ఉపాధి హామీ పథకం ఇంజినీరింగ్ అధికారులు ముందుగా కొలతలు ఇచ్చిన అనంతరం పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. వేతనదారులకు రోజుకు కనీసం రూ. 250లు వచ్చేలా పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు యాప్ ద్వారా మస్టర్లలో అటెండెన్స్ వేయాలన్నారు. దొంగ మస్టర్లు వేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. పరిశీలనలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని తుంబలిలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. సమయానికి కొంతమంది రాకపోవడంతో వారికి మస్టర్లలో ఆబ్సెంట్ వేశారు. ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు ఉన్న వారికి మాత్రమే పనికి వచ్చినట్లు గుర్తించాలన్నారు. మధ్యలో వెళ్లిన వారికి సైతం ప్రజెంట్ వేయరాదని ఆదేశించారు. రెండు పూటలా రావాలని, చిన్న పిల్లలను పనిలో చేర్చరాదని అన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం


ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: చుక్కల భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ రైతన్నలకు ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పట్టాలు పంపిణీ చేయడం చారిత్రక నిర్ణయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఇక రైతులు భూ సమస్యల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒక్క పైసా ఖర్చు కూడా లేకుండా రైతులకు హక్కులు కల్పించడం గొప్ప నిర్ణయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వేల కుటుంబాలకు సీఎం చొరవతో మేలు చేకూరిందన్నారు.

నేడు బిత్రపాడు సచివాలయం ప్రారంభం

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు సచివాలయాన్ని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారని పంచాయితీ కార్యదర్శి సింధు శ్రావణి శుక్రవారం తెలిపారు. గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

104 సిబ్బంది నిరసన

పాలకొండ: ప్రభుత్వం 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకుడు విస్సు కోరారు. శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. వేతనం పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ముఖ్యమంత్రికి విన్నవించామని తెలిపారు. కార్యక్రమంలో 104 సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు లేకుండా చర్యలు

గరుగుబిల్లి: ఇంటి ముందు మురుగు నిల్వలు లేకుండా చూడాలని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని గొట్టివలసలో ఫ్రైడే.. డ్రైడే సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా మురుగు నిల్వ లేకుండా చేయాలన్నారు. తాగేసి విడిచిన కొబ్బరి బోండాలు, టైర్లు తదితరవి ఇంటి ఆవరణలో లేకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒకరోజు ఇంటిలో వాడుతున్న పాత్రలను ఎండలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

పార్వతీపురంటౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్‌మోహనరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గంగాపురం, కోరి, కవిటిభద్ర గ్రామాల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలను తనిఖీ చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు గ్రామాల్లో అందుబాటులో ఉన్నాయో? లేదో అని తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతల గృహాలను సందర్శించి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, జయగౌడ్, సరోజిని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం


వైఎస్సార్ పొలంబడి - వరిపంట వైకుంఠపాళి అనే పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ, తదితరులు

పాచిపెంట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కోటికిపెంట పంచాయతీ వలసలమండలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ ఇజ్జడ అప్పలనాయుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఎంపీపీ స్పందిస్తూ వలసల మండ గ్రామంతో పాటు మండలంలో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమానికి సంబంధించి ఏఓ తిరుపతిరావు తయారుచేసిన వరి పంట వైకుంఠపాళి పోస్టర్‌ను ఎంపీపీ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రజలు తెలియజేసిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశానికి కొన్ని శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరుకాని అధికారులకు నోటీసు లందించాలని ఎంపీడీఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరి, వైస్ ఎంపీపీలు మీసాల నారాయణ, కొరిపిల్లి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మురళీధర్

పాలకొండ రూరల్: అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని చేపడుతున్న సైబర్ నేరాలపై దృష్టి పెట్టాలని పాలకొండ సీఐ మురళీధర్ అన్నారు. సర్కిల్ పరిధిలో ఎస్సైలతో క్రైమ్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యంగా బ్యాంక్ లావాదేవీలు, ఉద్యోగాల పేరిట, ఏటీఎం కేంద్రాల వద్ద, సెల్‌ఫోన్ల ద్వారా సమాచార సేకరణ పేరిట జరుగుతున్న మోసాల బారిన ప్రజలు పడకుండా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో సచివాలయ మహిళా పోలీసుల ద్వారా విస్తృతంగా ప్రజల్లో ఈ విషయంపై అవగాహన తీసుకువచ్చే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం స్టేషన్ల వారీగా నమోదైన కేసుల వివరాలపై సమీక్ష చేపట్టారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు.

చిత్రలేఖనంపై శిక్షణ


చిత్రలేఖనంపై తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: చిత్రలేఖనం ద్వారా సమాజంలో ఉన్న వివిధ అంశాలకు దృశ్యరూపం కల్పించవచ్చని తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మరళి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిబిరం ద్వారా విద్యార్థులకు చిత్రలేఖనంపై తర్ఫీదు ఇచ్చారు. బొమ్మలు వేయటంతో సులభ పద్ధతులను వివరించారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి గ్రంథ పాలకుడు బి.గణేష్‌బాబు నేతృత్వంలో శుక్రవారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు.

నెలాఖరులోగా రైతుభరోసా మొదటి విడత


మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా పథకానికి సంబంధించి 2023–24 ఖరీఫ్ సీజన్‌కు గాను మొదటి విడతగా నగదు జమ ఈ నెలాఖరులోగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో వేయడానికి సిద్ధం చేస్తున్నట్లు ఏఓ ఎస్ అవినాష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్వీ రమణ అధ్యక్షతన మండల వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఓ అవినాష్ మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో అర్హులైన రైతుల జాబితా ప్రదర్శించినట్లు తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వారు పేర్లున్నదీ లేనిదీ పరిశీలించుకోవచ్చని స్పష్టం చేశారు. రైతు భరోసా పథకం పొందడానికి అర్హత ఉండి జాబితాలో పేరు లేని రైతులు మళ్లీ నమోదు చేసుకునేందుకు మేనెల 15 నుంచి 18 లోగా గ్రీవెన్స్ పోర్టల్ అందుబాటులో ఉంటుందన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి మండలంలో 8873మంది రైతులకు గాను 7115 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోగా 1758 మంది రైతులు ఇంకా చేయించాల్సి ఉందన్నారు. ఈకేవైసీ చేయించని రైతుల బ్యాంక్ ఖాతాలకు నగదు జమకాదని తేల్చిచెప్పారు. మండలంలోని జొన్నగింజలు కొనుగోలు కేంద్రాన్ని పార్వతీపురంలో ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

కౌలు రైతులు సర్టిఫికెట్స్ చేయించుకోవాలి

మండలంలో జిరాయితీ భూములను కౌలుకు సాగు చేస్తున్న రైతులు కౌలు సర్టిఫికెట్స్ చేయించుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ సూచించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమి ఉన్నా, భూమిలేని రైతులు కౌలు సర్టిఫికెట్స్ చేయించుకోవచ్చని స్పష్టం చేశారు. కౌలు సర్టిఫికెట్ ఇవ్వడం వల్ల జిరాయితీ భూమి గల రైతులకు ఎటువంటి ఇబ్బందులుండవని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు, పలుగ్రామాల సర్పంచ్‌లు రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గోపాలపురంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం

పార్వతీపురంటౌన్: ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నెలకు రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గర్భిణులు, వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్నామన్నారు. 62 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచాన పడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్య సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందన్నారు. రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులను నిర్వహిస్తున్నామని, ప్రజలంతా ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగుతో లాభాలు


సేకరించిన నవధాన్యాల విత్తనాలు పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

భామిని: ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగు పద్ధతితో భూమిలో సూక్ష్మజీవులు పెరిగి భూమికి కావాల్సిన అన్ని పోషకాలు అందుతాయని, భూమి సారవంతంగా మారుతుందని పార్వతీపురం మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని పోలవరంలో నవధాన్యాల సాగుపై గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. పోలవరం సర్పంచ్ బిడ్డిక నారాయణ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న తొమ్మిది రకాల విత్తనాలు సేకరించి సిద్ధం చేశారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణలో భాగంగా పోలవరంలో నవధాన్యాలు సాగు చేస్తున్న మోటక అంభోజి పొలాన్ని జిల్లా ప్రాజెక్టు మేనేజరు పరిశీలించారు. డివిజన్ ఇన్‌చార్జి పి.బాలు, మండల ఇన్‌చార్జి శివప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సారా

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పాటిల్, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్ ఆదేశాలతో ఎన్‌ఫోర్సుమెంటు ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రా ప్రాంతానికి సారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో కొమరాడ మండలం గుమడ అగ్రహారం సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. 160 లీటర్ల సారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. కోలా అజిత్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ శేఖర్, కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని నైట్ వాచ్‌మన్ నియామకం


నైట్ వాచ్‌మన్ నియామకంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న స్థానికులు

వీరఘట్టం: మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్‌మన్ పోస్టు నియామకం గందరగోళంగా మారింది. గ్రామంలో చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన మనస్పర్థలు వల్ల నైట్ వాచ్‌మన్ పోస్టు నియామకం నిలిచిపోయింది. ఇప్పటికే రెండుసార్లు గ్రామస్తులను సమన్వయం చేసిన అధికారులు తాజాగా శుక్రవారం కూడా ఉపవిద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి, తహసీల్దార్ సి.హెచ్ సత్యనారాయణ, ఎంఈఓ శ్రీనివాసరావు హైస్కూల్ ఆవరణలో విద్యా కమిటీ, వంట ఏజెన్సీ మహిళలతో సమావేశం నిర్వహించారు. అయినా వీరి మధ్య ఉన్న అంతర్గత కారణాల వల్ల నైట్ వాచ్‌మన్ పోస్టు నియామకం జరగలేదు. సమావేశంలో సర్పంచ్ నడిమింటి లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు యు.భాస్కరరావు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో నర్సులదే కీలక పాత్ర


మదర్ ఆఫ్ మోడరన్ నర్సింగ్ ఫ్లోరెన్స్‌కు నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం: ఆస్పత్రుల్లో రోగులకు వైద్య సేవలు అందించడంలో నర్సులదే కీలక పాత్ర అని స్థానిక సీహెచ్‌సీ వైద్యురాలు శోభారాణి అన్నారు. ఆస్పత్రులతో పాటు క్షేత్ర స్థాయిలో కూడా సేవలు అందించడంలో వీరి పాత్ర మరువలేమన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో నర్సులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆమె కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులతో కలసిమెలిసి సొంత కుటుంబ సభ్యుల్లా నర్సులు చూడడాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. రోగులకు ఆస్పత్రుల్లో ధైర్యం చెప్పేది నర్సులేనన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆశ, సుక్రుత, సాయి, ఠాగూర్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం


విద్యార్థులకు యోగాసానాలపై అవగాహన కల్పిస్తున్న జనార్ధనరావు

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగాను అనుసరించటం వలన ఏకాగ్రత పెరుగుతుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఉత్తమ ఉపాధ్యాయుడు, యోగా శిక్షకుడు కె.జనార్ధనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికపై విద్యార్థులకు యోగాసనాలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. దీని వలన దీర్ఘకాల ఆరోగ్య సమస్యలను అధిగమించటంతో పాటు రోగ నిరోధక శక్తిని సాధించవచ్చని పిల్లలకు వివరించారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు

సీతానగరం: మండలంలోని మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం అవడానికి కుటీర పరిశ్రమలు నెలకొల్పి పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి సభ్యులకు అవగాహన కల్పించేందుకు మండల, క్లస్టర్ కో ఆర్డినేటర్లు కృషి చేయాలని వెలుగు ఏపీఎం ఆర్. శ్రీరాములు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలకేంద్రంలో పొదుపు సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో మండలకేంద్రంలో మార్ట్‌లు ఏర్పాటు చేయడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. అలాగే సంఘసభ్యులు వారి పిల్లల విద్యాభివృద్ధికి వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా తోడ్పడాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో వీఓఏల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి బిజినెస్ మార్ట్‌ల ఏర్పాటుకు సభ్యులందరినీ భాగస్వాములను చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో సభ్యత్వ నమోదు జరుగుతోందని చెప్పారు. స్త్రీనిధి ద్వారా ఇళ్లలోనే కుటీర పరిశ్రమలు నిర్వహించి వచ్చిన ఆదాయంతో పిల్లల చదువులకోసం వినియోగించడం అభినందనీయ మన్నారు. త్వరలో మండల మార్ట్‌లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామని తెలియజేశారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోవాలి


రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ పి.ఉషారాణి

సీతానగరం: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ శిబిరం ద్వారా వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.ఉషారాణి కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని లచ్చయ్యపేటలో 104 అధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.ఉషారాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్న సంకల్పంతో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వయోవృద్ధులకు బీపీ, సుగర్, రావడం వల్ల కంటిచూపు మందగించి, ఇతర వ్యాధులు సోకుతాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి రోగనిర్ధారణ పరీక్షలుచేసి వారికి కావలసిన మందులు ఇవ్వడంతో పాటు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వ్యాధులు తగ్గుముఖం పట్టేంతవరకూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలిచ్చారు. అలాగే 104 సంచార వైద్యసేవా వాహనంలో గర్భిణులు, బాలింతలుకు వైద్య పరీక్షలు చేసి వారికి కావలసిన మందులు ఇచ్చి, ప్రసవ సమయంలో ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులను చేర్పించాలని కోరారు. ప్రజలంతా వైద్య సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, దుర్గాప్రసాద్, ప్రసాద్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.